'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

www.rajyasamskarana.com

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 34 | శుక్రవారం | 18.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 34 | Friday | 18.9.2026 | Pages: 8 | Rate: 2




## టాటాల కుంపట్లు పదవి కోసం సిగపట్లు

• కుర్చీ కోసం కొత్త పంచాయితీ • చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్లు
• వద్దనే వద్దంటూ ట్రస్ట్ అభ్యంతరం

టాటా అంటే కేవలం ఉప్పు కాదు.. కారు కాదు.. సాఫ్ట్‌వేర్ కాదు.. దేశంలో కోట్లాది మంది జీవితాలను ఏదో ఒక రూపంలో తాకిన పేరు టాటా. ఒకరి చేతిలో టాటా ఉప్పు ఉంటే.. మరొకరి ఇంట్లో టాటా స్కై కనెక్షన్ ఉండొచ్చు. ఇంకొకరి ప్రయాణం టాటా కారు మీద సాగుతుండొచ్చు. ఎవరో టీసీఎస్‌లో ఉద్యోగం చేస్తుండొచ్చు. మరొకరి బ్యాంకింగ్, విమాన ప్రయాణం, హోటల్ బస, పెట్టుబడుల వెనుక టాటా సంస్థ ఉండొచ్చు. దేశ ఆర్థిక వ్యవస్థలో ఇంత లోతుగా పాతుకుపోయిన ఈ దిగ్గజ సంస్థలో ఇప్పుడు అసలు ఏం జరుగుతోంది? నాలుగు దశాబ్దాలుగా టాటాలతోనే ప్రయాణించి అత్యున్నత స్థాయికి చేరిన ఎన్. చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్లు చైర్మన్ పదవి ఇవ్వాలని టాటా సన్స్ బోర్డు నిర్ణయించింది. కానీ.. *66* శాతం వాటా కలిగిన టాటా ట్రస్టులు మాత్రం ఈ నిర్ణయాన్నే చట్టబద్ధం కాదంటున్నాయి. ట్రస్టుల చైర్మన్ నోయెల్ టాటా ఎందుకు వ్యతిరేకించారు? చంద్రశేఖరన్ ఒకసారి తప్పుకోవాలని చెప్పి మళ్లీ ఎలా వచ్చారు? ఇది వ్యక్తుల మధ్య పోరా.. లేక టాటా సామ్రాజ్య భవిష్యత్‌పై సాగుతున్న పెద్ద అంతర్గత సమరమా? అసలు టాటా గ్రూప్ యాజమాన్యం ఎలా పనిచేస్తుంది? సామాన్యుడి జీవితంతో దాని బంధం ఏమిటి? ఈ కథ వెనుక దాగిన అసలు లెక్కలు ఏంటి?



## కేసీఆర్‌పై రేవంత్ బ్రహ్మాస్త్రం

6లో..

- నెల రోజుల్లో లెక్క తేలుతుందా?
- ఎర్రవల్లి కథ ఎటు తిరుగుతుందో!?
- కాంగ్రెస్ విప్పబోయే గుట్టేంటి?

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి భూముల లెక్క తెరపైకి వచ్చింది. ఈసారి నేరుగా మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టూ ఉన్న భూములపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. *700* ఎకరాల విస్తీర్ణం... అందులో *388* ఎకరాలు ప్రభుత్వ భూములేనన్న ఆరోపణలు... *30* రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయా? రికార్డుల్లో మార్పులు జరిగాయా? ధరణి సమయంలో భూముల హక్కులు ఎలా మారాయి? నిజంగా ప్రభుత్వ భూమి ఉంటే దాన్ని తిరిగి స్వాధీనం చేసుకొని దళితులకు పంచుతారా? ఇవన్నీ ఇప్పుడు ఎదురవుతున్న ప్రశ్నలు. అంతకంటే కీలకమైన ప్రశ్న మరోటి. ఈ విచారణ కూడా గతంలో జరిగిన విచారణల మాదిరిగానే మొదలై... కొంతకాలానికి చప్పుడు లేకుండా ఆగిపోతుందా? కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల వ్యవహారం, లిక్కర్ ఆరోపణలు, ధరణి వివాదాలపై జరిగిన పరిణామాలను గుర్తుచేసుకుంటూ ప్రజలు ఇప్పుడు ఈ విచారణ ఫలితాన్ని గమనిస్తున్నారు. రేవంత్ ఇప్పటికే ఇది కేవలం పార్ట్‌ఏ మాత్రమేనని.. పార్ట్ బీ కూడా ఉందని సంకేతం ఇచ్చారు. అంటే ఎర్రవల్లి దాటి గత పాలనలోని మరిన్ని భూ లావాదేవీలు వెలుగులోకి వస్తాయా? నెల రోజుల్లో రెవెన్యూ అధికారులు ఏం తేలుస్తారు? ఫామ్‌హౌస్ వరకు వెళ్లి సర్వే చేస్తారా? ప్రభుత్వ భూమి ఉంటే చర్యలు తీసుకుంటారా? ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అసలు ఉత్కంఠ ఇదే!



## ఎర్రవల్లి భూములపై సర్వే షురూ

**కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ లెక్కలు**

**పాత రికార్డులు.. క్షేత్రస్థాయి పరిశీలన**

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టుపక్కల భూములపై రెవెన్యూ సర్వే ప్రారంభమైంది. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనల నేపథ్యంలో మార్కుక్ మండల రెవెన్యూ అధికారులు పాత భూ రికార్డులను పరిశీలిస్తున్నారు. ఫామ్‌హౌస్ పరిసరాల్లోని భూములను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ వివరాలు సేకరిస్తున్నారు. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు సర్వే పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటున్నారు.



## ఆ భూములు మావే

**ఎర్రవల్లి భూములపై రైతులు**

**సర్వే అడ్డుకున్న దళితులు**

కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు సమీపంలోని భూముల్లో రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వేను స్థానిక రైతులు అడ్డుకున్నారు. సర్వే నంబర్ 325లో 388 ఎకరాల 5 గుంటల ప్రభుత్వ భూమి ఉందని, దాని హద్దులు గుర్తించేందుకు కలెక్టర్ ఆదేశాలతో వచ్చామని అధికారులు చెప్పినట్లు రైతులు తెలిపారు. ఇప్పటికే పలుమార్లు సర్వే జరిగిందని, ఇప్పుడు మళ్లీ ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. రాజకీయ ప్రకటనల తర్వాతే సర్వే ఎందుకు మొదలైందో తమకు అనుమానం కలుగుతోందని రైతులు నిలదీశారు. (వివరాలు 2లో..)

## ఆఫ్ఘన్‌ను షేక్ చేసిన శర్మ




**ఫాస్టెస్ట్ హండ్రెడ్ రికార్డ్**

అభిషేక్ శర్మ బ్యాట్ నుంచి బంతి బయటకు వెళ్లిందా.. బౌండరీ దాటిందా అన్నది ప్రేక్షకులు గుర్తించేలోపే స్కోర్‌బోర్డు పరుగులతో దూసుకెళ్లింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో అఫ్గానిస్థాన్ బౌలర్లపై 26 ఏళ్ల ఈ యువ ఓపెనర్ సృష్టించిన తుఫాను సాధారణ టీ20 ఇన్నింగ్స్ కాదు.. భారత క్రికెట్‌లో వేగానికి కొత్త నిర్వచనం. మొదట నెమ్మదిగా మొదలైన ఆట.. రెండో ఓవర్ నుంచి ఒక్కసారిగా దిశ మార్చుకుంది. సిక్సర్ల వర్షం.. ఫోర్ల మోత.. కేవలం 16 బంతుల్లో అర్ధశతకం.. 22 బంతుల్లో 76 పరుగులు.. ఆ తర్వాత శతకం కోసం సాగిన పరుగుల వేట. చివరకు కేవలం 30 బంతుల్లోనే టీ20 అంతర్జాతీయ శతకం. రోహిత్ శర్మ 35 బంతుల్లో నెలకొల్పిన భారత రికార్డు నేలకొరిగింది. అంతటితో ఆగలేదు.. టెస్ట్ ఆడే దేశాల ఆటగాళ్లలో అత్యంత వేగవంతమైన టీ20 శతకంగా ప్రపంచ రికార్డు నమోదైంది. పవర్‌ప్లేలో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డూ అభిషేక్ ఖాతాలోకి చేరింది. 34 బంతుల్లో 108 పరుగులు.. 11 సిక్సర్లు.. 9 ఫోర్లు.. 317.64 స్ట్రైక్‌రేట్. రషీద్ ఖాన్ బంతికి అతని తుఫాను ఆగిపోయినా.. అప్పటికే ప్రపంచ క్రికెట్ ముందు ఒక కొత్త సంచలనం నిలిచిపోయింది. (వివరాలు 8లో..)

## కేసీఆర్ కుటుంబానికి ఆ భూములు ఎలా వచ్చాయ్?

**సున్నా నుంచి వేల కోట్లంటూ పొంగులేటి ప్రశ్నలు**



రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎక్స్ వేదికగా కేసీఆర్ కుటుంబ భూములపై తీవ్ర ఆరోపణలు చేశారు. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో కేసీఆర్ తనకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని పేర్కొన్నారని, ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పదేళ్ల బీఆర్ఎస్ (2లో..)

## కేసీఆర్ కుటుంబ భూములపై విచారణ జరగాలి

**అఫిడవిట్ల లెక్కలపై నిగ్గు తేల్చాలన్న పీసీసీ చీఫ్**



కేసీఆర్ కుటుంబ భూములపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 2004, 2009 ఎన్నికల అఫిడవిట్లలో కేసీఆర్‌కు భూములు లేవని చూపించగా.. 2014లో 35 ఎకరాలు, 2023 నాటికి 53 ఎకరాలు ఉన్నట్లు నమోదైందని ఆయన తెలిపారు. కేటీఆర్ కుటుంబానికి 2023 నాటికి 123 ఎకరాలు ఉన్నాయని, 2026లో కేటీఆర్ 67 ఎకరాలు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. (2లో..)

## మా ఆస్తులు..మీ ఆస్తులు లెక్కలు తేల్చేద్దాం

**• సీఎంకు కేటీఆర్ సవాల్**



ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధానికి దారితీసింది. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన భూవ్యవహార ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. మొదట కేసీఆర్‌కు ఫామ్‌హౌస్ పరిధిలో 1,000 ఎకరాల భూమి ఉందని చెప్పి, ఇప్పుడు 67 ఎకరాలేనని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. (వివరాలు 2లో..)



## మల్లారెడ్డి కుటుంబానికి షాక్

**ప్రీతి రెడ్డి ఫ్లెక్సీలు చించేసిన సొంత పార్టీ కార్యకర్తలు**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కుటుంబానికి మేడ్చల్‌లో ఊహించని పరిణామం ఎదురైంది. ప్రీతి రెడ్డి జన్మదినం సందర్భంగా కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు చించివేశారు. (వివరాలు 2లో..)



## ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

**రెండు స్థానాలకు కొత్త ఓటర్ల జాబితా**

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీపై సీఈసీ కసరత్తు**

తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కసరత్తు ప్రారంభమైంది. 2027 మార్చిలో మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. దీంతో ఎన్నికల కోసం కొత్త ఓటర్ల జాబితా రూపొందించే ప్రక్రియను అధికారులు మొదలుపెట్టారు. (వివరాలు 2లో..)

## ఒక హత్య ప్రతీకారంతో ప్రాణం బలి

**వైష్ణవి హత్య కేసులో మరో విషాదం**

**బెయిల్‌పై బయటకు.. దాడిలో భర్త హతం**

ఒక కుటుంబంలో చెలరేగిన విషాదం.. మరో కుటుంబంలో ప్రతీకారాగ్నిగా మారి చివరకు మరో ప్రాణాన్ని బలితీసుకుంది. నాలుగు నెలల గర్భంతో ఉన్న వైష్ణవి హత్యతో మొదలైన కన్నీటి కథ.. ఇప్పుడు ఆమె భర్త హరిబాబు హత్యతో మరో మలుపు తిరిగింది. (వివరాలు 2లో..)



## నానక్‌రామ్‌గూడ భూములపై రగడ

**ఆ భూములను కబ్జా చేయలేదు**

**వివాదంపై అల్లు అర్జున్ మామ**

హైదరాబాద్ నానక్‌రామ్‌గూడ ఐటీ కారిడార్‌లోని మంత్రీ కాస్మోస్ ప్రాంగణంలో భూమి హక్కుల వివాదం పోలీస్ కేసు వరకు వెళ్లింది. నటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డితో పాటు మురళీధర్ రెడ్డి, గడ్డం రవి తదితరులపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. (వివరాలు 2లో..)





## రష్యా చమురుపై అమెరికా ఒత్తిడి

- 100% సుంకాలతో సంబంధాలకు దెబ్బ
- యూఎస్‌కు భారత్ ఘాటు హెచ్చరిక

## భారత సార్వభౌమత్వంపై దాడి

**యూఎస్ చట్టంపై కాంగ్రెస్ అభ్యంతరం**

## ఒక్క గంట హోం మంత్రి పదవి ఇవ్వండి

**అసెంబ్లీకి రండి.. లెక్కలు తేల్చేస్తా: అద్దంకి సవాల్**



కాంగ్రెస్ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "నాకు మంత్రి పదవి అవసరం లేదు.. ఒక్క గంట హోంమంత్రి పదవి ఇస్తే దోపిడీదారులందరినీ లోపలేస్తా" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. (2లో..)

## అన్యాయాన్ని ఎదిరించడమే తెలంగాణ బలం

**పోరాట స్ఫూర్తితో ప్రజా పాలన... సీఎం రేవంత్**



ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ పోరాట చరిత్రను గుర్తుచేశారు. అన్యాయాన్ని ఎదిరించడం తెలంగాణ గడ్డ స్వభావమని అన్నారు. సమ్మక్క-సారలమ్మల పోరాటం నుంచి రైతాంగ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు ఈ నేల ప్రజా చైతన్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ భారతదేశంలో విలీనమైన రోజు రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరిచిందని చెప్పారు. ప్రజల హక్కులు కాపాడటం, సమస్యలు పరిష్కరించడం, ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించడమే ప్రజా పాలన లక్ష్యమన్నారు.

## వారి డీఎన్ఏ టెస్ట్ చేయాలి




- నిజాం ప్రశంసలపై బండి ఫైర్
- విమోచన వేడుకల్లో ఘాటు వ్యాఖ్యలు

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సంకల్పంతోనే తెలంగాణకు విమోచనం లభించిందని అన్నారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానం మరో ఏడాది నిజాం పాలనలో కొనసాగిందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి త్యాగాలు చేశారని చెప్పారు. (వివరాలు 2లో..)

# ఎర్రవల్లి భూములపై సర్వే షురూ

- కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ లెక్కలు
- పాత రికార్డులు.. క్షేత్రస్థాయి పరిశీలన



### 350 ఎకరాలపై ఆరోపణలు.. నివేదికకు రంగం సిద్ధం

అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి ఫామ్‌హౌస్ పరిసరాల్లో 350 ఎకరాలకు పైగా భూముల రికార్డులు మార్చినట్లు ఆరోపించారు. ప్రభుత్వ భూముల వివరాలను నిర్ధారించేందుకు సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అధికారులు రికార్డులు, భూముల వివరాలను సరిపోల్చుతున్నారు. తదుపరి దశలో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసి ఫామ్‌హౌస్ భూములకు సంబంధించిన పత్రాలు కోరే అవకాశం ఉందని సమాచారం. కేసీఆర్ సమర్పించే పత్రాలను అధికారిక రికార్డులతో పోల్చి రెవెన్యూ శాఖ సమగ్ర నివేదిక సిద్ధం చేయనుంది. సర్వే సమయంలో నిబంధనలు ఉల్లంఘించారని భావిస్తే న్యాయపరమైన మార్గాన్ని ఆశ్రయించేందుకు న్యాయవాదులు సిద్ధంగా ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# ఆ భూములు మావే

## ఎర్రవల్లి భూములపై రైతులు

- సర్వే అడ్డుకున్న దళితులు





### భూములు లాక్కుంటే ఎలా

సర్వే నంబర్ 325లో 300కు పైగా దళిత కుటుంబాలు తరతరాలుగా సాగు చేసుకుంటున్నాయని రైతు మల్లేష్ తెలిపారు. గతంలో భూముల్లో పెద్ద బండరాళ్లు ఉండటంతో సాగు కష్టంగా ఉండేదని చెప్పారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బండరాళ్లు తొలగించడం, చెరువుల మరమ్మతులు, డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుతో సాగు సులభమైందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం అక్కడ వరి సాగు చేస్తున్నామని తెలిపారు. "రాజకీయాల కోసం మా భూములు తీసుకుంటే మా కుటుంబాలు ఎక్కడికి వెళ్లాలి? ప్రాణం పోయినా భూములు ఇవ్వం" అంటూ మల్లేష్ స్పష్టం చేశారు.



# అన్యాయాన్ని ఎదిరించడమే తెలంగాణ బలం

## పోరాట స్ఫూర్తితో ప్రజా పాలన... సీఎం రేవంత్

### రైతు నుంచి మహిళ వరకు

తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని సీఎం తెలిపారు. రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, రైతు భరోసా, సన్నాలకు రూ.500 బోనస్ వంటి చర్యలను వివరించారు. భూ భారతి ద్వారా భూ పరిపాలనలో సంస్కరణలు చేపట్టామని చెప్పారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక మద్దతు అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్య, వైద్యం, సామాజిక న్యాయానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

### భవిష్యత్ తెలంగాణకు రోడ్‌మ్యాప్

యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాలు అందించేందుకు 72 వేలకు పైగా ప్రభుత్వ నియామకాలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి కార్యక్రమాలు చేపట్టామని రేవంత్ తెలిపారు. మెట్రో విస్తరణ, విమానాశ్రయాలు, మూసీ పునరుజ్జీవనం, రహదారుల అభివృద్ధిని ప్రస్తావించారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీ నిర్మాణం ద్వారా తెలంగాణను ప్రపంచ స్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని మార్చే దిశగా పనిచేస్తున్నామని వెల్లడించారు.



# వారి డీఎన్ఏ టెస్ట్ చేయాలి

- నిజాం ప్రశంసలపై బండి ఫైర్
- విమోచన వేడుకల్లో ఘాటు వ్యాఖ్యలు

వీర బైరాన్‌పల్లి, పరకాల, గుండ్రాంపల్లి, నిర్మల్ వంటి ప్రాంతాల్లో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ ఆ పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. నిజాంను గొప్పవాడిగా చిత్రీకరించే నేతలు తెలంగాణ చరిత్రను మరోసారి చదవాలని సూచించారు. హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని కేంద్రం అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు.

### నిజాం ప్రశంసలపై తీవ్ర విమర్శ

నిజాం పాలనపై ప్రశంసలు చేయడం సరికాదంటూ బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజల ధన, మాన, ప్రాణాలకు నష్టం కలిగించిన పాలనను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. నిజాంను ప్రశంసించే నేతలపై ఆయన తీవ్ర పదజాలం ఉపయోగించారు. నిజాంను పొగిడే నేతలకు డీఎన్ఏ పరీక్షలు చేయాలని, అసలు వారు ఈ దేశ పౌరులేనా? లేక వారిలో విదేశీ డీఎన్ఏ ఉందా? అనేది తేల్చాలన్నారు. తెలంగాణ పోరాట చరిత్రను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను వక్రీకరించవద్దని అన్నారు. అదే సమయంలో తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో రాష్ట్రానికి రూ.12 లక్షల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రజలు చరిత్రను గుర్తుంచుకోవాలని, త్యాగాలను గౌరవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై హైదరాబాద్ విలీన పోరాటంలో త్యాగాలు చేసిన వారిని స్మరించారు.

# ఆ భూములు ఎలా వచ్చాయ్?

## కేసీఆర్ కుటుంబానికి ఆ భూములు ఎలా వచ్చాయ్?

తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పదేళ్ల బీఆర్ఎస్ పాలన వరకు కేసీఆర్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే ఆస్తుల పరిమాణంలో భారీ మార్పు కనిపిస్తుందని పొంగులేటి పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు, పేదలు, దళితుల అసైన్డ్ భూములపై అక్రమాలకు పాల్పడటం వల్లే ఈ ఆస్తులు పెరిగాయని ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై స్వతంత్ర ధృవీకరణ అవసరం అని స్పష్టం చేయాల్సిన అంశమూ ఉంది.



### కేటీఆర్ ఆస్తులపైనా ప్రశ్నలు

కేటీఆర్ గతంలో తన కుటుంబానికి మొదటి నుంచే వందల ఎకరాల భూములు ఉన్నాయని చెప్పిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ పొంగులేటి మరో ప్రశ్న సంధించారు. 2009 ఎన్నికల అఫిడవిట్‌లో కేటీఆర్ ఒక ఎకరం భూమి మాత్రమే చూపించారని, ఇప్పుడు వందల ఎకరాల ఆస్తులు ఎలా వచ్చాయని నిలదీశారు. అమెరికాలో ఉద్యోగం చేసి సంపాదించానని కేటీఆర్ చెబుతున్న నేపథ్యంలో ఈ ఆస్తుల పెరుగుదలపై ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు. ధరణి వ్యవస్థను ఉపయోగించుకుని ప్రభుత్వ భూములు, దళితుల భూములు లక్ష్యంగా చేసుకున్నారన్నది తన ఆరోపణగా పేర్కొన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించిన భూముల వివరాలపై కూడా కేటీఆర్ సమాధానం చెప్పాలని పొంగులేటి తన పోస్టులో డిమాండ్ చేశారు.

### అఫిడవిట్లతోనే తేల్చాలన్న సవాల్

కేసీఆర్ కుటుంబ ఆస్తుల పెరుగుదలపై రాజకీయ ఆరోపణలు కాకుండా ఎన్నికల అఫిడవిట్లు, రిజిస్ట్రేషన్ రికార్డులు, భూ రికార్డుల ఆధారంగా నిజానిజాలు తేల్చాలని పొంగులేటి వ్యాఖ్యల సారాంశం. తెలంగాణ రెవెన్యూ శాఖ పరిధిలో ప్రభుత్వ భూములు, సర్వే, భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వ్యవహారాలు కీలకంగా ఉంటాయి. కేసీఆర్ కుటుంబం ఆస్తులు ఎలా పెరిగాయి? ఏ భూములు ఎవరి పేర్లలో ఉన్నాయి? వాటి కొనుగోలు, బదలాయింపులకు సంబంధించిన పత్రాలు ఏమిటి? అన్న ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్రంగా మారాయి. ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత పక్షాల వివరణలు, అధికారిక భూ రికార్డులు వెలుగులోకి వస్తేనే పూర్తి వాస్తవ చిత్రం స్పష్టమవుతుంది.

# కేసీఆర్ కుటుంబ భూములపై విచారణ జరగాలి

## అఫిడవిట్ల లెక్కలపై నిగ్గు తేల్చాలన్న పీసీసీ చీఫ్

ఎన్నికల అఫిడవిట్లలో చూపిన వివరాలకు ప్రస్తుత ఆస్తులకు పొంతన ఉందా అనే అంశంపై సమగ్ర విచారణ అవసరమని డిమాండ్ చేశారు. తెలంగాణలో భూమిలేని పేదలు ఎంతో మంది ఉన్నప్పుడు ఈ స్థాయిలో భూములు ఎలా సమకూరాయో కేసీఆర్ కుటుంబం సమాధానం చెప్పాలని అన్నారు.

### జన్వాడ, 22ఏపైనా విచారణ

జన్వాడ ఫామ్‌హౌస్ తనది కాదని కేటీఆర్ చెబుతున్నప్పటికీ అక్కడ ఆయన ఉంటున్నట్లు సమాచారం ఉందని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఫామ్‌హౌస్ నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించారన్నది తమ ఆరోపణగా పేర్కొన్నారు. అయితే ప్రభుత్వానికి ఎవరి ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకునే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాలో తప్పులు జరిగి ఉంటే వాటిపైనా విచారణ జరుగుతోందన్నారు. మరోవైపు స్పీకర్ తల్లిపై బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. పోలీసుల పట్ల వారి వ్యవహారశైలిని కూడా విమర్శించారు.

### కాంగ్రెస్ గ్రాఫ్‌పై మహేశ్ గౌడ్ వ్యాఖ్య

తెలంగాణలో భూముల వ్యవహారం రాజకీయంగా వేడెక్కిన సమయంలో మహేశ్ గౌడ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కేసీఆర్ కుటుంబ ఆస్తులపై కచ్చితమైన రికార్డుల ఆధారంగా సమగ్ర విచారణ జరగాల్సిందే అని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వివరాలు వెల్లడించిన తర్వాత దళితులు, బీసీ వర్గాల్లో చర్చ పెరిగిందని తెలిపారు. ఇదే సమయంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో పార్టీ గ్రాఫ్ పెరిగిందని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.



# మా ఆస్తులు.. మీ ఆస్తులు

- లెక్కలు తేల్చేద్దాం
- సీఎంకే కేటీఆర్ సవాల్



ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధానికి దారితీసింది. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన భూవ్యవహార ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. మొదట కేసీఆర్‌కు ఫామ్‌హౌస్ పరిధిలో 1,000 ఎకరాల భూమి ఉందని చెప్పి, ఇప్పుడు 67 ఎకరాలేనని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. 67 ఎకరాల వివరాలు కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లోనే ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్‌పై చేసిన ఆరోపణలకు సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వం భూముల అంశాన్ని రాజకీయంగా ఉపయోగిస్తోందని కేటీఆర్ విమర్శించారు.

### అమెరికా ఉద్యోగం ప్రస్తావన

తన ఆస్తులపై ప్రశ్నలు లేవనెత్తడాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. తాను అమెరికాలో ఆరున్నర సంవత్సరాలు ఉద్యోగం చేసి సంపాదించానని, తన ఆస్తులకు సంబంధించిన వివరాలు బహిరంగంగానే ఉన్నాయని అన్నారు. రేవంత్‌రెడ్డి గత జీవితం గురించి తనకు తెలుసంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కొండారెడ్డిపల్లికి వెళ్లి వివరాలు అడిగితే అక్కడి వాస్తవాలు తెలుస్తాయని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు వ్యవసాయ భూములు మొదటి నుంచే ఉన్నాయని, కుటుంబానికి పూర్వం నుంచే ఆస్తులు ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.

### బంధువుల భూములు ఎందుకు కలిపారు?

కేసీఆర్ కుటుంబానికి సంబంధం లేని వ్యక్తుల ఆస్తులను కూడా వారి ఖాతాలో కలిపి చూపుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కూకట్‌పల్లికి చెందిన కొండల్‌రావుతో తమకు ఎలాంటి బంధుత్వం లేదని, కేవలం ఒకే సామాజిక వర్గానికి చెందినవారనే కారణంతో ఆయన ఆస్తులను తమ కుటుంబానికి ఆపాదించారని అన్నారు. నవీన్‌రావు, ఇతర బంధువుల ఆస్తులను కూడా కేసీఆర్ కుటుంబ భూముల లెక్కల్లో కలపడం సరికాదని ప్రశ్నించారు. ఇదే సమయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎర్రవల్లి భూములపై విచారణకు ఆదేశించింది. సుమారు 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్న ఆరోపణలపై సర్వే, విచారణ కొనసాగుతోంది.



# ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

- రెండు స్థానాలకు కొత్త ఓటర్ల జాబితా
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీపై సీఈసీ కసరత్తు

తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కసరత్తు ప్రారంభమైంది. 2027 మార్చిలో మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. దీంతో ఎన్నికల కోసం కొత్త ఓటర్ల జాబితా రూపొందించే ప్రక్రియను అధికారులు మొదలుపెట్టారు. సెప్టెంబర్ 28 నుంచి ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. నవంబర్ 6 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇప్పటికే ఓటరుగా నమోదైన వారు కూడా ఈసారి మళ్లీ ఫారం-18 దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. అర్హత కలిగిన పట్టభద్రులు ఎన్నికల అధికారుల సూచనల మేరకు తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

### డిసెంబర్ 30న తుది జాబితా

ఓటర్ల నమోదు పూర్తయిన తర్వాత నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. ఆ జాబితాపై అభ్యంతరాలు, సవరణలకు అవకాశం కల్పించిన అనంతరం డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. రెండు నియోజకవర్గాల్లోని అర్హత కలిగిన పట్టభద్రులు ఈ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 2027 మార్చిలో ఖాళీ కానున్న స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ఓటర్ల జాబితా సిద్ధం చేసే ప్రక్రియ కీలక దశకు చేరింది. ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం తర్వాత ప్రకటించనుంది.

### ఎస్ఐఆర్ నోటీసులకు సులభ పరిష్కారం

మరోవైపు ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లకు జారీ చేసిన నోటీసుల పరిష్కారాన్ని సులభతరం చేస్తూ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై కుటుంబంలోని ఏ వయోజన సభ్యుడైనా సంబంధిత ఈఆర్ఓ లేదా ఏఈఆర్ఓ ఎదుట హాజరై కుటుంబ సభ్యుల తరఫున పత్రాలు సమర్పించవచ్చు. ఈ విధానం ఇప్పటికే పలు జిల్లాల్లో అమల్లోకి వచ్చింది. పెండింగ్, భవిష్యత్ ఫారం6 దరఖాస్తులకు డిక్లరేషన్ ఫారాలు తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 1, 2026ను దీనికి అర్హత తేదీగా నిర్ణయించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఎస్ఐఆర్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ గడువు నవంబర్ 9 వరకు పొడిగించగా, క్లెయిమ్స్-అభ్యంతరాల గడువు అక్టోబర్ 7 వరకు పెరిగింది.

# ఒక్క గంట హోం మంత్రి పదవి ఇవ్వండి

## అసెంబ్లీకి రండి.. లెక్కలు తేలేస్తా: అద్దంకి సవాల్

అసెంబ్లీ సమావేశాలను నెల రోజులు కాదు.. రెండు నెలలు పొడిగించినా సభకు వచ్చే ధైర్యం బీఆర్ఎస్ నేతలకు ఉందా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడు సభకు రాకుండా బయట మీడియా ముందు మాట్లాడటం సరికాదన్నారు. సభకు వస్తే పదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలపై ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతోనే దూరంగా ఉంటున్నారని దయాకర్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్‌లో ఒక ఎకరం చూపించి తర్వాత 64 ఎకరాలు ఎలా వచ్చాయో ప్రజలకు వివరించాలని సవాల్ చేశారు.



### అసైన్డ్ భూములపై తీవ్ర ఆరోపణలు

దళితులు, పేదలకు చెందిన అసైన్డ్ భూముల విషయంలో గత ప్రభుత్వంపై అనేక ఆరోపణలు ఉన్నాయని దయాకర్ పేర్కొన్నారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారం, గజ్వేల్ ఫామ్‌హౌస్ చుట్టూ భూములు, ఓవర్లాప్ భూములు, నిర్మాణాలపై పూర్తి వివరాలు బయటకు రావాల్సి ఉందన్నారు. ల్యాండ్ సీలింగ్ నిబంధనలను ఉల్లంఘించి పేదల భూములను లాక్కున్నారన్నది తమ ఆరోపణగా తెలిపారు. బినామీ ఆస్తులు, భూ లావాదేవీలపై విచారణ కొనసాగుతోందన్నారు. అక్రమంగా స్వాధీనం చేసుకున్న భూములను గుర్తించి అర్హులైన పేదలకు తిరిగి అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రజల సొమ్ముకు సంబంధించిన అక్రమాలపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# నానక్‌రామ్‌గూడ భూములపై రగడ

## ఆ భూములను కబ్జా చేయలేదు

- వివాదంపై అల్లు అర్జున్ మామ

. మంత్రీ కాస్మోస్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి పెద్దిరాజు ఇచ్చిన ఫిర్యాదే దీనికి కారణం. సౌత్‌వెస్ట్ కార్నర్ గేట్ తాళాలు పగులగొట్టి ప్రాంగణంలోకి ప్రవేశించారని, అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బందిని బెదిరించారని ఫిర్యాదులో ఆరోపించారు. అక్కడ టిన్‌షీట్లు ఏర్పాటు చేసినట్లు కూడా పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను పోలీసులకు అందించినట్లు సమాచారం.

### ఏం జరిగింది.. ఎలా మొదలైంది?

వివాదానికి కేంద్రంగా ఉన్న భూమిపై తమకు హక్కులు ఉన్నాయని చంద్రశేఖర్ రెడ్డి చెబుతున్నారు. తాము ఎలాంటి అక్రమ ఆక్రమణకు పాల్పడలేదని, భూమిని రైతుల నుంచి కొనుగోలు చేశామని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు ఓనర్స్ అసోసియేషన్ మాత్రం తమ ప్రాంగణంలోకి అనుమతి లేకుండా ప్రవేశించి నిర్మాణ చర్యలు చేపట్టారని ఆరోపిస్తోంది. దీంతో ఒకే భూమిపై రెండు వర్గాల హక్కుల వాదన తెరపైకి వచ్చింది. ప్రస్తుతం పోలీసులు ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నారు. భూమి పత్రాలు, హక్కులు, సీసీటీవీ ఆధారాలు పరిశీలించిన తర్వాత అసలు వివాదం ఏంటన్నది స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# మల్లారెడ్డి కుటుంబానికి సొంత పార్టీ షాక్

## ప్రీతి రెడ్డి ఫ్లెక్సీలు చించేసిన కార్యకర్తలు

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కుటుంబానికి మేడ్చల్‌లో ఊహించని పరిణామం ఎదురైంది. ప్రీతి రెడ్డి జన్మదినం సందర్భంగా కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు చించివేశారు. ఫ్లెక్సీల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, స్థానిక ముఖ్య నేతల ఫొటోలు లేకపోవడంపై పార్టీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ ఘటనతో మేడ్చల్ బీఆర్ఎస్‌లో ఉన్న అంతర్గత విభేదాలు మరోసారి చర్చకు వచ్చాయి.

### మనోబలాన్ని ఎవరూ దెబ్బతీయలేరు

ఫ్లెక్సీల చించివేతపై ప్రీతి రెడ్డి ఘాటుగా స్పందించారు. అభిమానులు, సిబ్బంది తన పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు రాజకీయాలతో సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. ఫ్లెక్సీలను భౌతికంగా చించగలరేమో కానీ, తనలోని మనోబలాన్ని ఎవరూ దెబ్బతీయలేరంటూ వ్యాఖ్యానించారు. సొంత పార్టీకి చెందినవారే బహిరంగంగా ఫ్లెక్సీలను చించివేయడం ఇప్పుడు మేడ్చల్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మల్లారెడ్డి కుటుంబంపై అసంతృప్తి ఏ స్థాయిలో ఉందన్న దానిపై పార్టీ వర్గాల్లో చర్చ మొదలైంది.



రాజ్య సంస్కరణ
శుక్రవారం, 18.9.2026, మేడ్చల్ మల్కాజిగిరి

# తునిలో గంజాయి దందా

- ఇంటినే అడ్డాగా చేసుకుని రవాణా
- 125 కేజీల గంజాయి స్వాధీనం



కాకినాడ జిల్లా తుని పట్టణంలో భారీగా గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టు రట్టైంది. సీతారాంపురం ప్రాంతంలోని ఓ ఇంటిని అడ్డాగా చేసుకుని గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను తుని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 125 కేజీల గంజాయి, రూ.3.41 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.62.50 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఇంటి నుంచే గంజాయిని నిల్వ చేసి తరలిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. నిందితుల కార్యకలాపాలపై సమాచారం అందడంతో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి దాడి చేసినట్లు అధికారులు తెలిపారు.

**వాహనాలు సీజ్.. దర్యాప్తు ముమ్మరం**

గంజాయి రవాణాకు ఉపయోగించిన ఒక ఎర్టిగా కారు, ఒక ఆటో, రెండు మోటార్‌సైకిళ్లను పోలీసులు సీజ్ చేశారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పెద్దాపురం డీఎస్పీ తిలక్ మీడియాకు కేసు వివరాలు వెల్లడించారు. పట్టుబడిన నలుగురు వ్యక్తుల వెనుక మరెవరైనా ఉన్నారా? గంజాయిని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు.. ఎక్కడికి తరలిస్తున్నారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. రవాణా నెట్‌వర్క్‌కు సంబంధించిన వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ కేసులో దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ప్రశ్న రావణ్‌కు వారం రోజుల కస్టడీ

- లోతైన దర్యాప్తుకు కోర్టు అనుమతి
- ఏడు రోజులు పోలీసుల విచారణ



సోషల్ మీడియా వ్యాఖ్యలు, వీడియోలకు సంబంధించిన కేసులో యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ 'ప్రశ్న రావణ్'ను ఏడు రోజుల పోలీస్ కస్టడీకి గన్నవరం కోర్టు అనుమతించింది. కోర్టు ఆదేశాల ప్రకారం సెప్టెంబర్ 18 నుంచి 24 వరకు పోలీసులు ఆయనను కస్టడీలో విచారించనున్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, విద్వేషపూరిత వీడియోలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ప్రేరేపించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయనపై యూఏపీఏతో పాటు పలు చట్టాల కింద కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా నిషేధిత మావోయిస్టు భావజాలాన్ని ప్రోత్సహించేలా వీడియోలు, ప్రసంగాలు చేశారన్నది పోలీసుల ఆరోపణ.

## నెట్‌వర్క్‌పై పోలీసుల దృష్టి

కేసు దర్యాప్తును మరింత లోతుగా కొనసాగించేందుకు పోలీసులు కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రావణ్ వీడియోల వెనుక ఉన్న నెట్‌వర్క్, ఆయనకు సహకరిస్తున్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులు, మాజీ ఐఏఎస్-ఐపీఎస్ అధికారులతో ఉన్న సంబంధాలు వంటి అంశాలపై విచారణ చేయాల్సి ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. అలాగే రాజకీయ ప్రయోజనాల కోణాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై వ్యాఖ్యలు, హిందూ దేవుళ్లను కించపరిచారన్న ఆరోపణలపై కూడా గతంలో కేసులు నమోదైనట్లు వార్తలు వచ్చాయి. ప్రస్తుతం కోర్టు అనుమతితో వారం రోజుల విచారణలో ఈ ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలు, డిజిటల్ ఆధారాలు వెలుగులోకి రావాల్సి ఉంది.




41 ఏళ్ల కనిష్క బాంబు కేసు..

# ముగింపుపై కుటుంబాల ఆగ్రహం

- కనిష్క దర్యాప్తుకు ముగింపునకు సంకేతాలు
- న్యాయం కోసం బాధిత కుటుంబాల పోరాటం
- 329 మందిని బలిగొన్న నాటి విషాదం

1985 జూన్ 23న కెనడాలోని మాంట్రియల్ నుంచి లండన్‌కు వెళ్తున్న ఎయిర్ ఇండియా ఫ్లైట్ 182 'కనిష్క'లో బాంబు పేలింది. ఐర్లాండ్ సమీపంలోని అట్లాంటిక్ సముద్రంలో విమానం కూలిపోవడంతో అందులో ఉన్న 329 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 268 మంది కెనడా పౌరులు. ఈ ఘటన కెనడా చరిత్రలో అత్యంత ప్రాణాంతక ఉగ్రదాడిగా నమోదైంది.

## దర్యాప్తు తగ్గింపుపై కలకలం

41 ఏళ్ల తర్వాత ఈ కేసు దర్యాప్తును కెనడా రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ తగ్గించే అవకాశం ఉందన్న సమాచారం బాధిత కుటుంబాల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. ఇటీవల టొరంటోలో జరిగిన సమావేశంలో టాస్క్‌ఫోర్స్ పరిమాణాన్ని తగ్గించి, కేసును 'ఇన్‌యాక్టివ్' స్థితికి తీసుకెళ్లే అంశాన్ని అధికారులు ప్రస్తావించినట్లు కనిష్క ఫౌండేషన్ చైర్మన్ సంజయ్ లాజర్ వెల్లడించారు.

**కుటుంబాల నుంచి అభ్యంతరం**

ఈ పరిణామాన్ని లాజర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ దాడిలో తన తండ్రి, తల్లి, చిన్న చెల్లిని కోల్పోయిన ఆయన.. దశాబ్దాలుగా న్యాయం కోసం పోరాడుతున్నారు. దర్యాప్తు కొనసాగించేందుకు కొత్త సమాచారం తీసుకురావాలని కుటుంబాలను కోరడం బాధాకరంగా ఉందని ఆయన కెనడా ప్రధాని మార్క్ కార్నీకి రాసిన లేఖలో పేర్కొన్నారు.

**కొత్త దర్యాప్తు కోరుతున్న కుటుంబాలు**

కేసును మూసివేయడం కంటే కొత్త దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని కుటుంబాలు కోరుతున్నాయి. 1995లో ప్రకటించిన 10 లక్షల డాలర్ల బహుమతిని పెంచి, కొత్త సమాచారాన్ని సేకరించేందుకు మళ్లీ ప్రచారం చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నాయి. 41 ఏళ్ల తర్వాత కూడా అనేక ప్రశ్నలు మిగిలి ఉన్నాయని కుటుంబాలు చెబుతున్నాయి.

**న్యాయం కోసం పోరాటం**

ఈ కేసులో ఇందర్‌జిత్ సింగ్ రియాత్ దోషిగా తేలగా, మరో ఇద్దరు నిందితులు 2005లో నిర్దోషులుగా విడుదలయ్యారు. ఆ తర్వాత మరెవరిపైనా అభియోగాలు నమోదు కాలేదని కెనడా మేజర్ కమిషన్ నివేదిక పేర్కొంది. దీంతో బాధిత కుటుంబాలకు ఈ విషాదం ఇప్పటికీ పూర్తికాని న్యాయ పోరాటంగానే మిగిలింది.

# రష్యా చమురుపై అమెరికా ఒత్తిడి

- 100% సుంకాలతో సంబంధాలకు దెబ్బ
- యూఎస్‌కు భారత్ ఘాటు హెచ్చరిక



రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అమెరికా మరింత ఒత్తిడి పెంచుతోంది. రష్యా, ఇరాన్‌పై ఆంక్షలు విధించే కొత్త బిల్లును అమెరికా ప్రతినిధుల సభ ఆమోదించింది. రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు కొనసాగించే భారత్, చైనా వంటి దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఈ బిల్లు కల్పిస్తోంది. రష్యా ఇంధన రంగం, రక్షణ రంగం, అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా పలువురు అధికారులపై ఆంక్షలు, పశ్చిమ దేశాల ఆంక్షలను తప్పించుకునేందుకు ఉపయోగిస్తున్న రష్యా 'షాడో ఫ్లీట్'పై చర్యలకు కూడా బిల్లు అవకాశం కల్పిస్తోంది. ఇప్పటికే అమెరికా సెనేట్ ఆమోదించిన ఈ బిల్లు ఇప్పుడు ట్రంప్ సంతకం కోసం వెళ్లింది. దీంతో రష్యా చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై కొత్త ఆర్థిక ఒత్తిడి ఏర్పడే పరిస్థితి కనిపిస్తోంది.

**ద్వైపాక్షిక సంబంధాలపై భారత్ హెచ్చరిక**

అమెరికా చర్యపై భారత్ తన వైఖరిని స్పష్టం చేసింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం 1.4 బిలియన్ల భారత ప్రజలకు ఇంధన భద్రత కల్పించడం దేశానికి అత్యంత కీలకం. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై అమెరికాతో గత కొన్ని నెలలుగా ఉన్నత స్థాయిలో చర్చలు జరిగినట్లు కేంద్రం తెలిపింది. ఈ కొత్త చట్టం వల్ల భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలతో పాటు అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై కూడా ప్రభావం పడే అవకాశాన్ని అమెరికా అధికారులకు ఇప్పటికే వివరించినట్లు పేర్కొంది. భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. కొత్త పరిణామాల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వాణిజ్య, పరిశ్రమల సంస్థలతో ప్రభుత్వం కలిసి పనిచేస్తుందని తెలిపింది.

**ఇంధన అవసరాలే భారత్ వాదన**

ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారుగా ఉన్న భారత్‌కు రష్యా ముడిచమురు కీలక వనరుగా ఉంది. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభమైన తర్వాత పశ్చిమ దేశాలు మాస్కోపై విస్తృత ఆంక్షలు విధించాయి. ఆ సమయంలో భారత్ భద్రమైన, అందుబాటులో ఉండే, స్థిరమైన ఇంధన సరఫరాలే తమ ప్రాధాన్యత అని పదేపదే స్పష్టం చేసింది. అమెరికా గతంలోనూ రష్యా చమురు కొనుగోళ్లను తగ్గించేందుకు భారత్‌పై సుంకాల ద్వారా ఒత్తిడి తెచ్చింది. ఇప్పుడు కొత్త చట్టం అమెరికా అధ్యక్షుడికి మరింత అధికారాన్ని ఇవ్వనుంది. మరోవైపు బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లను దాటడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హార్ముజ్ జలసంధి పరిస్థితులు ప్రపంచ ఇంధన సరఫరాలపై ఆందోళన పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా సుంకాల నిర్ణయం భారత్ ఆర్థిక ప్రయోజనాలు, ఇంధన భద్రత, ద్వైపాక్షిక సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

## రష్యా చమురుపై అమెరికా కొరడా!

- భారత సార్వభౌమత్వంపై దాడి
- యూఎస్ చట్టంపై కాంగ్రెస్ అభ్యంతరం



రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధించేందుకు అమెరికా ప్రతినిధుల సభ తీసుకున్న నిర్ణయం భారత్‌లో రాజకీయ చర్చకు దారితీసింది. అమెరికా ప్రతినిధుల సభ లిండ్సే ఓ. గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్-2026ను 262-159 ఓట్ల తేడాతో ఆమోదించింది. ఈ చట్టం అమల్లోకి వస్తే రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు కొనసాగించే దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఈ బిల్లుకు అధ్యక్షుడి సంతకం అవసరం ఉంది. ఈ పరిణామంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ స్పందిస్తూ.. భారత్ విదేశాంగ విధానం, ఇంధన భద్రత నిర్ణయాలు వాషింగ్టన్ ప్రభావంలోకి వెళ్లాయా? అని ప్రశ్నించారు. రష్యా చమురు కొనుగోలుపై అమెరికా ఒత్తిడిని ఆయన భారత సార్వభౌమత్వానికి అవమానంగా అభివర్ణించారు.

**బ్రిక్స్ తర్వాత ఒత్తిడి**

ఇటీవల ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సంయుక్త ప్రకటనను భారత్‌పై అంతర్జాతీయ విశ్వాసానికి ప్రతీకగా ప్రభుత్వం ప్రస్తావిస్తున్న సమయంలోనే అమెరికా నుంచి ఈ చర్య రావడాన్ని కాంగ్రెస్ ప్రస్తావించింది. రష్యా నుంచి చమురు కొనాలా వద్దా అన్న నిర్ణయం భారత జాతీయ ప్రయోజనాలు, ఇంధన అవసరాలకు అనుగుణంగా న్యూఢిల్లీ తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. రష్యా చమురు కొనుగోలు విషయంలో భారత్‌కు స్వతంత్ర నిర్ణయాధికారం ఉండాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సూర్జేవాలా అన్నారు. అమెరికా సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. భారత్, చైనా మరోచోట నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేయాలని అమెరికా వైపు నుంచి వచ్చిన సూచనలను ఆయన భారత సార్వభౌమత్వంపై అవమానకర చర్యగా పేర్కొన్నారు.

**ఇంధన భద్రతపై కేంద్రం స్పష్టత**

కాంగ్రెస్ విమర్శల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం భారత ఆర్థిక, ఇంధన ప్రయోజనాలను కాపాడుతామని సంకేతం ఇచ్చింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ అమెరికా కాంగ్రెస్‌లో ఆమోదమైన రష్యా ఆంక్షల బిల్లుకు సంబంధించిన పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది. 1.4 బిలియన్ మంది ప్రజల ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశ ఇంధన భద్రత విషయంలో భారత్ దృఢంగా కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. మరోవైపు కాంగ్రెస్ మాత్రం అమెరికా ఒత్తిడిపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని త్వరగా వెల్లడించాలని డిమాండ్ చేసింది. దీంతో రష్యా చమురు కొనుగోళ్లు, అమెరికా ప్రతిపాదిత సుంకాలు, భారత్ విదేశాంగ విధానం, ఇంధన భద్రత అంశాలు ఇప్పుడు దేశీయ రాజకీయ చర్చల్లో కీలకంగా మారాయి.

# వేదికపై చప్పట్లు.. వెనుక కన్నీళ్లు!

- బకాయిలపై కళాకారుల నిరసన




తెలంగాణ సంస్కృతికి తమ కళలతో ఊపిరి పోసే కళాకారుల పరిస్థితి ఇప్పుడు హృదయవిదారకంగా మారింది. ప్రభుత్వ కార్యక్రమాల్లో శంఖం ఊదేది వారే.. డప్పు మోగించేది వారే.. జానపద కళలను ప్రదర్శించేది వారే.. గుస్సాడి నృత్యంతో వేడుకలకు వన్నె తెచ్చేది వారే. ముఖ్యమంత్రి, గవర్నర్, ప్రధాన మంత్రి వంటి ప్రముఖుల కార్యక్రమాల్లోనూ తమ కళను ప్రదర్శించినా.. వారి కష్టానికి రావాల్సిన డబ్బు మాత్రం ఏళ్లుగా అందలేదు. అంబర్‌పేటకు చెందిన రవి కుమార్‌కు రెండేళ్ల క్రితం చేసిన ప్రదర్శనకు సుమారు రూ.30 వేల పారితోషికం ఇంకా రాలేదు. ఆయనలాంటి వారు రాష్ట్రవ్యాప్తంగా వేలల్లో ఉన్నారని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.11.91 కోట్ల బిల్లులు పెండింగ్**

గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ కళాకారులు తమ నిరసనను వినూత్నంగా వ్యక్తం చేశారు. డప్పులు మోగించారు.. బాకాలు ఊదారు.. జానపద కళలు ప్రదర్శించారు.. గుస్సాడి వేషధారణతో నిరసన తెలిపారు. సాధారణంగా ప్రభుత్వ కార్యక్రమాలకు శోభ తెచ్చే ఈ కళలే ఈసారి తమ బకాయిల కోసం గొంతెత్తాయి. భాషా సాంస్కృతిక శాఖ కార్యాలయం ఎదుట జరిగిన ఆందోళనలో సుమారు 50 మంది కళాకారులు పాల్గొన్నారు. శాఖ డైరెక్టర్ అనుగు నరసింహారెడ్డి వారితో మాట్లాడారు. కళాకారులకు ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం రూ.11.91 కోట్లు అని ఆయన తెలిపారు. బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అయ్యాయని, పే అండ్ అకౌంట్స్ కార్యాలయం వాటిని ఆమోదించిందని చెప్పారు. ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల కావాల్సి ఉందని, ఈ నెలాఖరులోగా చెల్లింపులు జరిగే అవకాశం ఉందని తెలిపారు.

**కళను వదిలి.. బతుకుదెరువు కోసం**

అధికారులకు రూ.11.91 కోట్లు పెద్ద మొత్తం కాకపోవచ్చు. కానీ చిన్న మొత్తాలపై ఆధారపడి జీవించే కళాకారులకు మాత్రం అది కుటుంబ జీవనాధారం. ఒక్కో బిల్లు రూ.20 వేల నుంచి రూ.30 వేల మధ్యే ఉన్నా.. ఆ డబ్బు కోసం నెలలు, ఏళ్లు ఎదురుచూడాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. బకాయిలు రాకపోవడంతో పలువురు సంప్రదాయ కళలను వదిలి కూరగాయలు అమ్మడం, కొబ్బరికాయలు విక్రయించడం, రోజువారీ కూలీ పనులకు వెళ్లడం వంటి మార్గాలను ఎంచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వేడుకల్లో కళాకారుల ప్రదర్శనకు చప్పట్లు పడతాయి.. ఫొటోలు, వార్తల్లో వారి కళ కనిపిస్తుంది. కానీ అదే కళాకారుడి ఇంట్లో మాత్రం బకాయి పారితోషికం కోసం ఎదురుచూపులు, ఆర్థిక ఇబ్బందులు కనిపిస్తున్నాయి. "కళను కొనసాగించాలా.. బతుకుదెరువు కోసం వదిలేయాలా?" అన్న పరిస్థితి రావడం నిజంగా విచారకరం.

# 31 ఏళ్లకు తీర్పు

- 75 ఏళ్ల వయసులో జైలు
- 1995లో కరెప్షన్ కేసు



జార్ఖండ్‌లో రూ.100 లంచం తీసుకున్న కేసు 31 ఏళ్ల తర్వాత తుది దశకు చేరింది. 1995లో రాంచీలోని హటియా రైల్వే స్టేషన్‌లో పార్సెల్ క్లర్క్‌గా పనిచేసిన కాళీ శంకర్ ధోబీ.. నిర్మల్ కుమార్ బేగానీ అనే వ్యక్తి తన మోటార్‌సైకిల్‌ను హటియా నుంచి బిహార్‌లోని సమస్తిపూర్‌కు పంపించేందుకు వచ్చిన సమయంలో రూ.100 లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఫిర్యాదుదారు సీబీఐని ఆశ్రయించారు. ఫిర్యాదును పరిశీలించిన సీబీఐ అధికారులు వల పన్ని 1995 ఏప్రిల్ 27న రూ.100 తీసుకుంటున్న సమయంలో ధోబీని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదైంది. దాదాపు తొమ్మిదేళ్ల విచారణ తర్వాత 2004లో ప్రత్యేక న్యాయస్థానం ఆయనను దోషిగా తేల్చింది.

**కోర్టుల చుట్టూ రెండు దశాబ్దాలు**

ప్రత్యేక కోర్టు ధోబీకి రెండు సెక్షన్ల కింద జైలు శిక్ష, జరిమానా విధించింది. సెక్షన్ 7 కింద ఏడాది జైలు, రూ.4,000 జరిమానా, సెక్షన్ 13(2) కింద 18 నెలల జైలు, రూ.6,000 జరిమానా విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు కావాలని ఆదేశించారు. తీర్పును సవాల్ చేస్తూ ధోబీ జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే అక్కడ కూడా విచారణ రెండు దశాబ్దాలకు పైగా సాగింది. చివరకు జస్టిస్ ప్రదీప్ కుమార్ శ్రీవాస్తవ విచారణ జరిపి ట్రయల్ కోర్టు ఇచ్చిన దోష నిర్ధారణను సమర్థించారు. అంటే 1995లో ప్రారంభమైన కేసు దాదాపు 31 ఏళ్ల న్యాయప్రక్రియ తర్వాత ముగింపు దశకు చేరింది.

**75 ఏళ్ల వయసులో ఏడాది జైలు**

అయితే ధోబీ వయసు, అనారోగ్యం, కేసు సుదీర్ఘంగా కొనసాగిన కాలాన్ని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు శిక్షను తగ్గించింది. సెక్షన్ 7 కింద ఏడాది శిక్షను ఆరు నెలలకు, సెక్షన్ 13(2) కింద 18 నెలల శిక్షను ఏడాదికి తగ్గించింది. రెండు శిక్షలు ఏకకాలంలో అమలవుతాయి కాబట్టి గరిష్ఠంగా ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. కేసు కారణంగా ధోబీ ఇప్పటికే రైల్వే ఉద్యోగాన్ని కోల్పోయారు. గతంలో ఎలాంటి నేరచరిత్ర లేదని, ఇదే తొలి నేరమని కోర్టుకు వివరించినా దోష నిర్ధారణను రద్దు చేయలేదు. బెయిల్‌ను కూడా రద్దు చేసిన హైకోర్టు.. రెండు నెలల్లో లొంగిపోవాలని ఆదేశించింది. దీంతో 75 ఏళ్ల వయసులో ఆయన జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ఓట్ల సంఖ్య ఒకలా.. ఓటర్లు మరోలా

- ఢిల్లీ ఓటర్ల జాబితాలో సంచలనం!
- 24 నియోజకవర్గాల్లో షాకింగ్ లెక్కలు



ఢిల్లీలో ఓటర్ల జాబితా సవరణపై సంచలన గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకంగా 24 నియోజకవర్గాల్లో ప్రస్తుత ముసాయిదా ఓటర్ల సంఖ్య.. 2025 అసెంబ్లీ ఎన్నికల్లో వాస్తవంగా ఓటు వేసిన వారి సంఖ్య కంటే తక్కువగా ఉంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్)కు ముందు, ప్రక్రియలో జరిగిన ఓటర్ల తొలగింపుల తర్వాత ఈ పరిస్థితి ఏర్పడినట్లు నివేదిక పేర్కొంది. ఫిబ్రవరి 2025 ఎన్నికల సమయంలో ఈ 24 నియోజకవర్గాల్లో మొత్తం 49.1 లక్షల మంది ఓటర్లు ఉండగా, వారిలో 28.9 లక్షల మంది ఓటు వేశారు. అంటే 58.9 శాతం పోలింగ్ నమోదైంది. ఇప్పుడు అదే 24 నియోజకవర్గాల ముసాయిదా జాబితాలో కేవలం 27.7 లక్షల మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. అంటే గత ఎన్నికల్లో ఓటు వేసిన వారి కంటే ప్రస్తుతం నమోదైన ఓటర్లు 1.23 లక్షలు తక్కువగా ఉన్నారు.

## తొలగింపులపై కీలక ప్రశ్నలు

ఈ లెక్కలు సాధారణ ఓటర్ల జాబితా సవరణ కంటే ఎక్కువ చర్చకు దారితీస్తున్నాయి. ఎందుకంటే గత ఎన్నికల్లో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసిన వ్యక్తుల సంఖ్య కంటే.. తాజా ముసాయిదాలో ఉన్న ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండటం అసాధారణ పరిస్థితిగా కనిపిస్తోంది. ఓటర్ల తొలగింపులు, పేర్ల మార్పులు, చిరునామాల ఆధారంగా జరిగిన సవరణలు ఈ వ్యత్యాసానికి కారణమా అన్నది ఇప్పుడు పరిశీలనకు వస్తోంది. సర్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించారు. ఈ క్రమంలో నమోదైన పేర్లలో మార్పులు జరిగాయి. అయితే తొలగించిన ప్రతి పేరుకు సంబంధించిన కారణాలు, ప్రక్రియలో అనుసరించిన ధృవీకరణ విధానం ఇప్పుడు కీలకంగా మారింది.

**ఎన్నికల వ్యవస్థపై కొత్త చర్చ**

ఢిల్లీ ఓటర్ల జాబితాలో బయటపడిన ఈ గణాంకాలు ఓటరు జాబితా ప్రక్షాళన ఎంత పారదర్శకంగా జరిగింది? అనే ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. ఓటర్ల జాబితా నుంచి అనర్హుల పేర్లను తొలగించడం ఎన్నికల ప్రక్రియలో సాధారణ చర్యే. అదే సమయంలో అర్హులైన ఓటర్ల పేర్లు పొరపాటున తొలగిపోకుండా చూడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. ముఖ్యంగా గత ఎన్నికల్లో ఓటు వేసిన వ్యక్తుల సంఖ్య కంటే తాజా జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య తక్కువగా కనిపిస్తున్న 24 నియోజకవర్గాల్లో పేరు తొలగింపుల పూర్తి వివరాలు, కారణాలు, ధృవీకరణ రికార్డులు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ ముసాయిదా గణాంకాలపై తుది జాబితా వెలువడే ముందు జరిగే పరిశీలన.. ఢిల్లీలో ఎన్నికల రికార్డులపై తదుపరి చర్చకు కీలకంగా మారనుంది.

# కాశీ విశ్వనాథుడి సన్నిధిలో బాబు



**పవిత్ర జలాలతో విశ్వనాథుడికి అభిషేకం**

వారణాసి పర్యటనలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు శ్రీ కాశీ విశ్వనాథుడిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి చంద్రబాబు ఆలయంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల సందర్భంగా వేద మంత్రోచ్ఛారణల మధ్య విశ్వనాథుడిని దర్శించుకుని ఆశీర్వాదం పొందారు. కాశీ విశ్వనాథుడి దర్శనాన్ని ఆధ్యాత్మికంగా ప్రత్యేకంగా భావించిన చంద్రబాబు.. పవిత్ర జలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు నిర్ణీత సంప్రదాయాల ప్రకారం పూజా కార్యక్రమాలను కొనసాగించారు.

# అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్

**అనారోగ్య కుటుంబానికి టీడీపీ అండ**



వేంపల్లె: అనారోగ్యంతో మంచానికే పరిమితమైన కుటుంబానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని టీడీపీ వేంపల్లె మండల ఇన్‌చార్జి అజ్జుగుట్టు రఘునాథ్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం రెడ్డయ్య కాలనీలో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబాన్ని ఆయన పరామర్శించి, సభ్యుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లారు. వైద్యుల ధ్రువీకరణ ఆధారంగా డీఎంహెచ్ఓ ద్వారా పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవడమే తమ ధ్యేయమని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ రామముని రెడ్డి, ఉపాధ్యక్షుడు వీరభద్ర, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అగస్తీశ్వరాలయ అక్రమాలపై చర్యలు ఎప్పుడు?

**రూ.62 లక్షల వ్యవహారంపై విచారణ డిమాండ్**



ప్రొద్దుటూరు: శ్రీ అగస్తీశ్వర స్వామి దేవాలయంలో రూ.62 లక్షల అక్రమాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని దేవాలయాల సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పుష్పాల శ్రీనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గత ఆగస్టు 17న ప్రభుత్వానికి నివేదిక సమర్పించినా బాధ్యులపై చర్యలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. 2021-25 మధ్య సరైన బిల్లులు, ఆడిట్ లేకుండా ఆలయానికి సంబంధం లేని వ్యక్తుల పేర్లతో సుమారు రూ.62 లక్షలు డ్రా చేసినట్లు అధికారులు గుర్తించి నివేదిక ఇచ్చారని తెలిపారు. ఈ వ్యవహారంలో అప్పటి ఈవోల పాత్రపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమాలకు సంబంధించి అధికారులను పక్కనపెట్టి కేవలం గుమస్తాపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటేనే నిధుల రికవరీ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇద్దరు అధికారులను కాపాడే ప్రయత్నం చేస్తే దేవాదాయశాఖకు చెడ్డపేరు వస్తుందని అన్నారు. ఇప్పటికైనా సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుని రూ.62 లక్షలు రికవరీ చేసి భక్తుల్లో విశ్వాసం కల్పించాలని సమితి తరపున కోరారు.

# ఎల్‌నినో వేళ పశువులపై ప్రత్యేక శ్రద్ధ

**రైతులకు పశువైద్య నిపుణుల అవగాహన**



గోపవరం: ఎల్‌నినో పరిస్థితుల్లో పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పశువైద్య నిపుణులు సూచించారు. పశువైద్య కళాశాల, ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో గోపవరం గ్రామంలో 32 మంది రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డా.ఇందిర పశుగ్రాసం, నీటి నిర్వహణ, వేడి ఒత్తిడి నివారణపై రైతులకు వివరించారు. ఎండ తీవ్రత పెరిగే సమయంలో పశువులకు స్వచ్ఛమైన నీరు, నీడ, తగిన గాలి ప్రసరణ, సమతుల్య పోషణ అందించాలని సూచించారు. ఎండుగడ్డి, సైలేజ్‌ను ముందుగానే తగినంతగా నిల్వ చేసుకోవాలని తెలిపారు. పశువుల్లో అధిక ఉష్ణోగ్రత, నీరసం, ఆహారం తీసుకోకపోవడం వంటి వేడి ఒత్తిడి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా పశువైద్యులను సంప్రదించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పశువుల సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ఆరోగ్య సమస్యలను తగ్గించవచ్చని నిపుణులు తెలిపారు. కార్యక్రమంలో డా.చరిత, డా.గాయత్రి, డా.మంజుల, డా.జాన్, డా.వంశీ రైతులకు సూచనలు అందించారు.

# రూ.12 కోట్ల పనులు.. 14 ప్రారంభం!

**జాప్యంపై కమిషనర్ ఆగ్రహం.. ఏఈపై చర్య**



ప్రొద్దుటూరు: 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన రూ.12 కోట్ల అభివృద్ధి పనుల్లో 49కి కేవలం 14 పనులే ప్రారంభం కావడంపై మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నిర్వహించిన సమీక్షలో పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, అగ్రిమెంట్లు పూర్తయిన పనులను సైతం వెంటనే ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహించే గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని, విధుల నిర్వహణలో అలసత్వం, అమలులో జాప్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్‌చార్జి ఏఈ పి.ఉదయ్‌కుమార్‌రెడ్డిని విధుల నుంచి తప్పించి సొంత శాఖకు పంపినట్లు తెలిపారు. ప్రారంభమైన ప్రతి పనికి సంబంధించిన వివరాలను వాట్సాప్ గ్రూపుల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించిన సుమారు రూ.12 కోట్ల పనులు పూర్తయ్యే వరకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని మున్సిపల్ ఇంజినీర్ శ్రీనివాసులను ఆదేశించారు. సమావేశంలో డీఈలు రాజేష్, ఏశోద, ఏఈలు సురేంద్ర, దస్తగిరి, వినోద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ కోసం చస్తున్న పాక్

**ఇంధన ధరల దెబ్బతో షాక్**
**షరీఫ్ సర్కారు దిద్దుబాటు**



పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు అంతర్జాతీయ చమురు సరఫరాలపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో పాకిస్థాన్ ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఇంధన ధరల పెరుగుదల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం మూడు నెలల పాటు కొత్త పొదుపు చర్యలు ప్రకటించింది. పాకిస్థాన్ కేబినెట్ ఆమోదించిన ఈ నిర్ణయాల్లో ప్రభుత్వ వాహనాలకు ఇంధన వినియోగం తగ్గించడం, కొత్త వాహనాల కొనుగోళ్లపై నిషేధం, అధికారుల విదేశీ పర్యటనలను నియంత్రించడం, అధికారిక విందులను నిలిపివేయడం ఉన్నాయి. విదేశీ అతిథులు, ప్రతినిధి బృందాల కోసం నిర్వహించే విందులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. ఇటీవలే పెట్రోల్ ధర లీటరుకు 4.10 పాకిస్థానీ రూపాయలు, హైస్పీడ్ డీజిల్ ధర 6.41 రూపాయలు పెరిగింది. దీంతో పెట్రోల్ ధర రూ.384.34, డీజిల్ ధర రూ.415.83కు చేరింది.

**ఖర్చులపై కత్తెర.. రాత్రి ఆంక్షలు**

ప్రభుత్వ వ్యయాలను తగ్గించేందుకు మరిన్ని ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఐటీ అవసరాలు మినహా మన్నికైన వస్తువుల ప్రభుత్వ కొనుగోళ్లపై నిషేధం విధించారు. అధికారిక సమావేశాలను సాధ్యమైనంత వరకు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా నిర్వహించాలని నిర్ణయించారు. వ్యాపార మార్కెట్లు రాత్రి 9 గంటలకు, వివాహ మండపాలు రాత్రి 10 గంటలకు, రెస్టారెంట్లు రాత్రి 11 గంటలకు మూసివేయాలి. అయితే మెడికల్ ల్యాబొరేటరీలు, మందుల దుకాణాలకు మినహాయింపు ఇచ్చారు. ఈ నిబంధనలు ఇస్లామాబాద్ పరిధిలో అమలవుతున్నాయి. రాష్ట్రాలు, ప్రాంతీయ ప్రభుత్వాలు కూడా ఇలాంటి పొదుపు చర్యలు చేపట్టాలని కేంద్రం సూచించింది. గతంలో చేపట్టిన ఇలాంటి చర్యలను జూన్‌లో శాంతి చర్చలు ప్రారంభమైన తర్వాత ఉపసంహరించారు.

**ప్రజా ఆగ్రహం.. ప్రభుత్వానికి మరో సవాలు**

అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు వేగంగా పెరగడం పాకిస్థాన్ ప్రభుత్వానికి కొత్త సమస్యగా మారింది. హోర్ముజ్, బాబ్-ఎల్-మండెబ్ జలసంధుల వద్ద భద్రతా పరిస్థితులు దిగజారడం, సౌదీ అరేబియా ఇంధన మౌలిక వసతులపై దాడులు జరగడం చమురు సరఫరాలపై ఆందోళన పెంచాయి. ఈ పరిణామాలు దేశీయ ఇంధన ధరలపై మరింత ఒత్తిడి పెంచుతున్నాయి. ఇంధన ధరలు తగ్గించాలంటూ జమాత్-ఇ-ఇస్లామీ ఆందోళనలకు హెచ్చరించింది. వచ్చే వారం నిరసనలు చేపడతామని ఆ పార్టీ ప్రకటించడంతో ప్రభుత్వం మరోవైపు ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా అంతర్జాతీయ చమురు సంక్షోభం, పెరుగుతున్న ఇంధన ధరలు, ప్రభుత్వ వ్యయ నియంత్రణ చర్యలు పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితిపై ఒత్తిడిని మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి.



పాపాఘ్ని నది ఆక్రమణలపై

# కాంగ్రెస్ ఫైర్

**పవిత్ర నదిని కాపాడాలంటూ డిమాండ్**

వేంపల్లి: పవిత్ర పాపాఘ్ని నదిని ఆక్రమణల నుంచి కాపాడాలని కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ మూలం రెడ్డి ధ్రువకుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వేంపల్లి తహసీల్దార్ శివశంకర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. వేంపల్లి-గాలివీడు, వేంపల్లి-కమలాపురం మధ్య నదీ పరివాహక ప్రాంతాల్లో కొందరు అక్రమంగా పంటలు సాగు చేస్తున్నారని ఆరోపించారు. గత వరదల్లో తీర ప్రాంతాలు కొట్టుకుపోయినా తిరిగి ఆక్రమణలు జరుగుతున్నాయని, దీంతో నది కుంటలా మారే పరిస్థితి ఉందన్నారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులతో నదీ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, నదీ గర్భంలో బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉందన్నారు. మోటార్ల కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం ప్రజలు, జంతువులకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సర్వే నిర్వహించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందన లేకుంటే కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామాంజనేయులు రెడ్డి, రామకృష్ణ, వేమయ్య, రవీంద్రనాథ్ రెడ్డి, బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



# బ్యాంకు ప్రతిష్ఠను దెబ్బతీయొద్దు

**రాచమల్లు ఆరోపణలు నిరాధారం**

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకుపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారమని టీడీపీ నాయకుడు ఈవీ సుధాకర్‌రెడ్డి ఖండించారు. గురువారం నెహ్రూ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుచరిత పేరుతో ఖాతా తెరిచి నగదు కాజేశారన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తాను బ్యాంకు ఖాతాదారుడిగా, మాజీ డైరెక్టర్‌గా బ్యాంకు అభివృద్ధిని కోరుకుంటున్నానని, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలకు ప్రస్తుత ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన తనయుడు కొండారెడ్డిని బాధ్యులను చేయడం సరికాదన్నారు. రాచమల్లు ఆరోపణలను ఖండిస్తున్నామని, గత ప్రభుత్వ పాలనకు సంబంధించిన అంశాలను ప్రజల ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. సమావేశంలో టౌన్ బ్యాంకు ఛైర్మన్ బొగ్గుల వెంకట సుబ్బారెడ్డి, మాజీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం

**నెలరోజులు పట్టణంలో కార్యక్రమం**

ప్రొద్దుటూరు: పట్టణంలో స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు నెలరోజుల పాటు ప్రజా కేంద్రంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. మహిళా స్వశక్తి భవన్‌లో మెప్మా రిసోర్స్ పర్సన్స్‌తో కలిసి 'సేవా జ్యోతి' దీపాన్ని వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. మహిళలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజలను భాగస్వాములను చేసి విస్తృత అవగాహన కల్పిస్తామని కమిషనర్ తెలిపారు. ప్రజా పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ హరిత వేడుకలు, ప్రపంచ పర్యాటక దినోత్సవం, స్వచ్ఛ సమృద్ధి, 'సఫాయిమిత్ర సురక్ష ఏవం సమ్మాన్' శిబిరం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించి పరిశుభ్రమైన వాతావరణంపై చైతన్యం కల్పిస్తామని చెప్పారు.

# అర్హులందరికీ గృహ పథకం

**ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి**



ప్రొద్దుటూరు: సొంత ఇంటి స్థలం ఉన్నా ఇల్లు నిర్మించుకోలేని అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ గృహ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సూచించారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతంలో జగనన్న ఇళ్ల పథకంలో ఇళ్లు మంజూరైన వారికి ప్రత్యామ్నాయ అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరగా, పరిశీలిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. వన్‌టౌన్ ప్రాంతంలో ఇరుకైన ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు సైతం గృహ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గృహ నిర్మాణానికి అవకాశం ఉన్న అర్హులు పత్రాలు సిద్ధం చేసుకుని నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి జబీవుల్లా, టౌన్ బ్యాంకు ఛైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు నాగరాజు, కుతుబుద్దీన్, చౌడం వెంకట కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# చనిపోయినట్టే.. రేషన్ తీసుకున్నట్టే!

**రికార్డుల్లో మరణం.. బయోమెట్రిక్‌లో జీవితం**

**ఒడిశా సంక్షేమంలో భారీ అవకతవకలు**



ఒడిశాలోని నిర్మాణ్ శ్రామిక్ సంక్షేమ పథకంలో భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ రికార్డుల్లో మరణించినట్లుగా నమోదైన ఏకంగా 2,487 మంది నిర్మాణ కార్మికులు ఆ తర్వాత కూడా జాతీయ ఆహార భద్రతా చట్టం, రాష్ట్ర ఆహార భద్రతా పథకం కింద రేషన్ పొందినట్లు ఆడిట్ గుర్తించింది. మరింత సంచలనంగా 753 మంది కార్మికులు మరణించిన తేదీ తర్వాత కూడా ఆధార్ బయోమెట్రిక్ ద్వారా రేషన్ తీసుకున్నారు. ఇదే సమయంలో వారి నామినీలకు మరణ పరిహారం కింద రూ.15.10 కోట్లు చెల్లించారు. బతికున్న వ్యక్తులను చనిపోయినట్లు చూపించి ప్రయోజనాలు పొందిన వ్యవహారంలో వైద్య అధికారులు కూడా మరణ ధ్రువపత్రాలు జారీ చేసినట్లు ముసాయిదా ఆడిట్ నివేదిక పేర్కొంది. ఈ నివేదిక 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కాగ్ తుది నివేదికలో భాగం కావచ్చని సమాచారం.

**డేటాబేస్‌ల పరిశీలనతో బయటపడిన నిజాలు**

ఆడిటర్లు వివిధ ప్రభుత్వ డేటాబేస్‌లను పరస్పరం పరిశీలించడంతో అక్రమాల స్థాయి మరింత స్పష్టమైంది. నిర్మాణ్ శ్రామిక్ పథకంలో మరణించిన 3,013 మంది.. ఎన్ఎఫ్ఎస్ఏ లబ్ధిదారుల జాబితాలో కూడా ఉన్నారు. 914 కేసుల్లో నిర్మాణ్ శ్రామిక్ రికార్డుల్లో ఒకే ఆధార్ ఉన్నా పేర్లలో తేడాలు కనిపించాయి. ఒడిశా జనన--మరణ నమోదు వ్యవస్థతో పోల్చినప్పుడు 15,265 మరణ కేసులు సరిపోగా, 9,325 కేసులకు సరిపోలే రికార్డులు కనిపించలేదు. 405 కేసుల్లో నకిలీ మరణ ధ్రువపత్రాలు లేదా ఇతర వ్యక్తుల ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేసినట్లు ఆడిట్ గుర్తించింది. వీటిలో 268 కేసులకు రూ.5.49 కోట్ల ప్రయోజనాలు చెల్లించగా, మరో 137 కేసుల్లో రూ.2.81 కోట్ల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి.

**గత ఫిర్యాదులపై చర్య ఎక్కడ?**

